

చేనేతలను ఆదుకున్నది వైఎస్సార్‌సీపీనే

చేనేత కార్మికుల సమస్యను గుర్తించి వారిని ఆదుకున్న ప్రభుత్వం వైఎస్సార్‌సీపీనేనని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. - 8లో



నవోదయను సందర్శించిన బార్క్ శాస్త్రవేత్తలు

రాజంపేట మండలం నారంరాజుపల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయాన్ని ముంబైలోని బార్క్‌కు చెందిన శాస్త్రవేత్తలు సందర్శించారు. - 8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 37.2 /27.6

జిల్లాలో సోమవారం 27.6- 37.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 11.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో ఖాళీగా ఉన్న 171 వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తు ఆహ్వానిస్తున్నామని జాయింట్ కలెక్టర్ గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8న నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. ఈనెల 9 నుంచి 10వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ, 11వ తేదీ పరిశీలన ఉంటుందన్నారు. 12,13 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 14వ తేదీ సమాచారం పంపుతామని ఆయన తెలిపారు. ఈ నెల 16వ తేదీ ఎంపికైన అభ్యర్థులకు శిక్షణా కార్యక్రమం ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

రెవెన్యూ గ్రూపు-4 సర్వీసుల ఉత్తీర్ణత జాబితా విడుదల

కడప సెవెన్‌రోడ్స్ : రెవెన్యూశాఖకు సంబంధించి గ్రూపు-4 సర్వీసులకు చెందిన జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి సంబంధించిన ఉత్తీర్ణత జాబితాను విడుదల చేశామని డీఆర్‌ఓ గంగాధర్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తీర్ణత జాబితా నుంచి 102 మంది అభ్యర్థులను 1:2 నిష్పత్తితో ఎంపిక చేశారన్నారు. జాబితాను కడప వెబ్‌సైట్‌లో పొందు పరిచినట్లు చెప్పారు.ఇందులో పేర్లు ఉన్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం క్రమసంఖ్య1 నుంచి 51 వరకు ఈ నెల 9వ తేదీ ఉదయం 10 గంటలకు, క్రమ సంఖ్య 52 నుంచి 102 వరకు ఈ నెల 10వ తేదీ ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయానికి హాజరుకావాలన్నారు.సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో అర్హత పొందిన అభ్యర్థులకు ఈనెల 18వ తేదీ ఉదయం 9 గంటలకు కడప బాలాజీనగర్‌లోని ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీలో పరీక్ష జరుగుతుందన్నారు. ఈ కంప్యూటర్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టికెట్లు, గుర్తింపుకార్డు వెంట తెచ్చుకోవాలన్నారు.

ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఎంపికలు



జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి ఫుట్‌బాల్ ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపికచేసినట్లు వైఎస్ఆర్ కడప జిల్లా ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి ఎం. సుధీర్ తెలిపారు. ఆదివారం జరిగిన ఎంపికలకు విచ్చేసిన వారిలో రాణించిన వారిని రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ సంఘం ప్రతినిధులు థామస్ జీవన్‌బాబు, సుబ్బయ్య, డేనియల్ గంగులయ్య, అనిల్, మైఖేల్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కడప సెవెన్‌రోడ్స్ : రీ సర్వే కార్యక్రమంలో క్షేత్ర స్థాయిలో తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సర్వేయర్లు సోమవారం రాత్రి జాయింట్ కలెక్టర్ జి.గణేష్ కుమార్‌కు విన్నవించారు. ఏపీ సర్వే ఎంప్లాయిస్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ రీ సర్వేలో గ్రౌండ్ ట్రూతింగ్ పని రోజుకు 25 ఎకరాలు చేయాలని ఎస్‌ఓపీలో ఉండగా జిల్లాలో మాత్రం రోజుకు 60 ఎకరాలు చేయాలని ఒత్తిడి తెస్తున్నారని అన్నారు. గ్రౌండ్ ట్రూతింగ్ పనులకు వీఆర్వోలు, వీఆర్ఏలు హాజరు కావడం లేదన్నారు. రోజుకు 40 సర్వేరాళ్లు పాతాల్సి ఉండగా, జిల్లాలో 100 రాళ్లు పాతిస్తున్నారని తెలిపారు. రీ సర్వే జరిగే గ్రామాల్లో ఎఫ్ లైన్ అర్జీలు స్వీకరించరాదని కోరారు.మహిళా సర్వేయర్లకు అధిక టార్గెట్‌లు ఇస్తున్నారని చెప్పారు. అన్ని రకాల ప్రభుత్వ సెలవులను వినియోగించుకునే అవకాశం కల్పించాలన్నారు.

నేటి నుంచి తిరుత్తణికి ప్రత్యేక బస్సులు



మదనపల్లె సిటీ : ఆడికృత్తిక పురస్కరించుకుని మంగళ,బుధవారాల్లో తిరుత్తణికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ-2 డిపో మేనేజర్ ఆర్‌సి నిరంజన్ తెలిపారు. ఉదయం 5.30, 6 గంటలకు బస్సులు బయలుదేరుతాయన్నారు. పాన్నై స్వర్ణ వినాయకస్వామి గుడి, వడ్డనేరి గణేష్ దేవాలయం, తర్వాత తిరుత్తణి ఆలయం, అనంతరం షోలింగర్ యోగ నరసింహస్వామి గుడి దర్శించుకుని మదనపల్లెకు రావడం జరుగుతుందన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సులో ప్రయాణించాలని కోరారు.

పోషణ.. ఆరోగ్య సంరక్షణ

- ఇక నుంచి టేక్ హోం రేషన్ సేవలు
- అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లకుండానే పౌష్టికాహారం
- గర్భినులు బాలింతలకు వరం

కడప కోటిరెడ్డి సర్కిల్ : జిల్లాలో గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషక ఆహారాన్ని అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వారికి అండగా నిలుస్తోంది. ముఖ్యంగా రక్తహీనత నివారణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టింది. గర్భిణులు, బాలింతలు రోజూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి వెళ్లడానికి ఇబ్బందులు తలెత్తడంతో సంపూర్ణ పోషక ఆహారాన్ని ఇంటికే అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. 10రకాల సరుకులను ప్రత్యేక సంచుల్లో నెలకు రెండుసార్లు ఇంటికే అందించే బృహత్తర కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

10రకాల సరుకులు..

జిల్లాలో 11 ప్రాజెక్టులలో 2389 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ప్రతినెలా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ లబ్ధిదారులకు అందిస్తున్నారు. తాజాగా ఇళ్లకే కిట్లను పంపే ఉద్దేశంతో ప్రభుత్వం 15కిలోల బ్యాగ్‌లో 10రకాల సరుకులను నింపి సరఫరా చేస్తోంది. ఇప్పటికే అవి కేంద్రాలకు చేరుకున్నాయి.

జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టులు 11

2389 అంగన్‌వాడీ కేంద్రాలు

14,888 గర్భవతులు

14,239 బాలింతలు



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందిస్తున్న అధికారులు

టీడీపీ ప్రభుత్వంలో అవస్థలు

టీడీపీ ప్రభుత్వంలో అరకొర సరుకుల కోసం అంగన్‌వాడీ కేంద్రాలకు గర్భిణులు, బాలింతలు గంటల తరబడి కేంద్రాల వద్ద వేచి ఉండాల్సి వచ్చేది. మరోవైపు నెలలు నిండిన గర్భిణుల పరిస్థితి మరింత దయనీయంగా ఉండేది. సరుకుల నాణ్యత, తూకాల్లోనూ తేడా ఉండేది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత గర్భిణులు, బాలింతలు ఎక్కువ సేపు వేచి ఉండకుండా అనేక చర్యలు చేపట్టారు. తాజాగా మరో అడుగు ముందుకేసి బాలింతలు, గర్భిణులందరికి ఇళ్లకే 10రకాల సరుకుల కిట్లు పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చి యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. లబ్ధిదారుల సరుకులు తీసుకున్నారో లేదో తెలిసేలా ఫొటోలు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. దీంతో మహిళల నుంచి సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లోని సరుకుల వివరాలు

సరుకుల పేరు	పరిమాణం
బియ్యం	3కిలోలు
కంది పప్పు	ఒక కిలో
ఫామోలిన్	అర్థ లీటర్
పాలు	2.5లీటర్లు
కోడి గుడ్లు	25
అటుకులు	కిలో
రాగిపిండి	2కిలోలు
బెల్లం	250గ్రాములు
వేరుశనగ చిక్కీలు	250గ్రాములు
ఎండు ఖర్జూరం	250గ్రాములు



ముఖ్యమంత్రి మేలు మరువలేం..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. మాలాంటి వారికి ఇంటి వద్దకే పంపిణీ చేయడం సంతోషదాయకంగా ఉంది. గర్భిణీ అయిన వెంటనే సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పేరు నమోదు చేసుకున్న తర్వాత ఆరోగ్య పరిస్థితులపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ సూచనలిస్తున్నారు. జగనన్న చేస్తున్న మేలును ఎప్పటికి మరువలేం.

– శశికళ (గర్భిణీ), కడప

పౌష్టికాహారం ఇవ్వడం హర్షణీయం



సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మంచి పౌష్టికాహారాన్ని అందజేస్తోంది. ప్రస్తుతం కిట్ల ద్వారా ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడం హర్షణీయం. మంచి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత సమస్య తగ్గుతోంది., మరోవైపు సరుకులను ఇంటికే అందించడం గొప్ప విషయం.

– మదార్‌బీ(బాలింత), కడప

సద్వినియోగం చేసుకోవాలి



వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా టీహెచ్ఆర్(టేక్ హోం రేషన్) కార్యక్రమాన్ని ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేస్తోంది. బాలింతలు, గర్భిణులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని 10రకాల సరుకులతో కూడిన బ్యాగును అర్హులకు ఇంటి వద్దనే అందజేస్తున్నాం. వాటిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీలక్ష్మి(ఐసీడీఎస్ పీడీ), కడప

అర్హులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఇవ్వాలి



వైఎస్సార్ పోషణ కిట్లను అందిస్తున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి మాసూం బాషా

ప్రొద్దుటూరు : అర్హులందరికీ ప్రభుత్వం మంజూరు చేసిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందించాలని కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసూం బాషా తెలిపారు. ప్రొద్దుటూరు మండల పరిధిలోని అమృతానగర్-2, 5 అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం తన సిబ్బందితో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంచి ఉద్దేశంతో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా విలువైన పోషకాహారాన్ని అందిస్తోందన్నారు. అనంతరం ఆయన అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను పరిశీలించి స్వయంగా విచారించారు. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం ఏర్పాటు చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం లబ్ధిదారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐ టి.రెడ్డప్ప, మైన్స్ ఏజీ జి.శ్రీనివాసులు, ఏఈ కేఈ కిశోర్ పాల్గొన్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు టైలరింగ్, బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నామని సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.18–45 సంవత్సరాల వయస్సు కలిగిఉండాలన్నారు.గ్రామీణ మహిళలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. దూరప్రాంతాల నుంచి వచ్చు వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈఅవకాశాన్ని వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 94409 05478, 63028 33546 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని 24 మండలాల్లో, 50 గ్రామ పంచాయతీల్లో 40 సర్పంచ్ స్థానాలకు, 65 వార్డు స్థానాలకు సోమవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ షెడ్యూల్ విడుదల చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 8వ తేదీ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారు. 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 11వ తేదీ ఉదయం 8 గంటలకు నామినేషన్ల పరిశీలన కార్యక్రమం నిర్వహిస్తారు. 12వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు తిరస్కరించిన వాటిపై అప్పీలు చేసుకోవచ్చు. 13వ తేదీన అప్పీళ్లను విచారించి పరిష్కరిస్తారు. 14వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్లను ఉప సంహరించుకునేందుకు గడువు ఇచ్చారు. ఆరోజు 3 గంటల తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. 19వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పోలింగ్ నిర్వహిస్తారు.అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. ఓట్ల లెక్కింపు తర్వాత ఫలితాలు ప్రకటిస్తారు. ఫలితాలు ప్రకటించిన రోజే ఉప సర్పంచ్‌ల ఎన్నికలు నిర్వహిస్తారు. కొండాపురం మండలం కే . సుగుమంచిపల్లె గ్రామపంచాయతీకి సంబంధించి సర్పంచ్, అందరు వార్డు సభ్యుల ఎన్నికలు నిర్వహిస్తారు. ఉప సర్పంచ్ ఎన్నిక నిర్ణయించిన తేదీలో జరుగని పక్షంలో ప్రభుత్వ సెలవు దినం కాకపోతే మరుసటి రోజు నిర్వహిస్తారు. ఒకవేళ ఎక్కడైనా రీపోలింగ్ నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడితే ఈనెల 20వ తేదీ ఉదయం 7 గంటల నుంచి ఒంటిగంట లోపు నిర్వహిస్తామని డీపీఓ వివరించారు.

ఫిర్యాదులపై స్పందించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 'స్పందన'కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ బాధితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన' ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలనీ ఎస్పీ సూచించారు. ప్రజలకు సైబర్‌క్రైమ్‌కు సంబంధించి ఎలాంటి సమస్య వున్నా ఆన్‌లైన్ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్ క్రైమ్. జీఓవి డాట్ ఇన్ ద్వారా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ)కు, టోల్ ఫ్రీ నంబర్ 1930 కు ఫిర్యాదు చేయొచ్చని సూచించారు.

నేతన్నలకు అండగా ప్రభుత్వం

కలెక్టర్ విజయరామరాజు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న చేనేత కార్మికులు, అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : చేనేత కుటుంబాల ఆర్థిక అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారి జీవితాల్లో వెలుగులు నింపుతోందని జిల్లా కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో చేనేత జౌళి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 9వ జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ జింకా విజయలక్ష్మి, జాతీయ చేనేత ఐక్యవేదిక కన్వీనర్ అవ్వారు మల్లికార్జున, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ రాగా నరసింహులు, ఆప్కో డీఎం వరప్రసాద్, ఆప్కో డైరెక్టర్ ఉదయగిరి వెంకటేస్‌లు హాజరయ్యారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మగ్గాలనే నమ్ముకొని జీవనోపాధి పొందుతున్న నేతన్నలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా మగ్గం ఉన్న ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.24వేల ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. ఒకప్పుడు ప్రపంచ జీడీపీలో 25 శాతం వృద్ధి చేనేత పరిశ్రమ ద్వారానే అందేదని గుర్తు చేశారు. మన సంస్కృతి సంప్రదాయ చేనేత వృత్తిని పరిరక్షించుకునేందుకు ప్రతి చేనేత కార్మికుడు వారి వృత్తిని గౌరవ ప్రధానంగా స్వీకరించి ఈతరం యువతను ప్రోత్సహించాలన్నారు. అనంతరం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాజధాని నుంచి చేసిన ప్రసంగాన్ని వీసీ ద్వారా సభికులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించడం జరిగింది.ఈసందర్భంగా ఏర్పాటు చేసిన ఆప్కో చేనేతల ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. అంతకు ముందు జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో చేనేత సంఘాల నాయకులు ర్యాలీ నిర్వహించారు. చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు వి.హరికృష్ణ, వీవర్స్ సర్వీస్ సెంటర్ ప్రతినిధి సూర్యనారాయణ, తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం పల్లా నరసింహారావు, అధికారులు అహ్మద్, కృష్ణ, శేషగిరిరావు,రవిప్రకాష్‌రెడ్డిలు పాల్గొన్నారు.

అర్జీలకు సకాలంలో పరిష్కారం

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజలు సమర్పించే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ విజయరామరాజు అధికారలును ఆదేశించారు. సోమవారం స్పందన కార్యక్రమంలో ఆయన అర్జీలు స్వీకరించి పరిశీలించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువు లోపు వాటిని పరిష్కరించాలన్నారు.

స్వాతంత్య్ర వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

77వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయరామరాజు అధ/ కారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో జెండా వందన కార్యక్రమానికి వేదికను అందంగా అలంకరించాలన్నారు. స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబసభ్యులు, ప్రజాప్రతినిధులు, ఇతర అతిథులను ప్రత్యేక ఆహ్వానించాలని చెప్పారు. విశిష్ట సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేయడానికి జాబితాలను నిర్ణీత గడువు లోపు పంపాలన్నారు.

జగనన్న గృహాలు వేగంగా పూర్తి చేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న జగనన్న గృహాలను వేగంగా పూర్తిచేయాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గృహనిర్మాణ లక్ష్యాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. జేసీ గణేష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ భరద్వాజ్, డీఆర్‌ఓ గంగాధర్‌గౌడ్,హౌసింగ్ పీడీ కృష్ణయ్య, బద్వేలు, పులివెందుల, జమ్మలమడుగు ఆర్డీలు వెంకటరమణ, వెంకటేశు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

దూరవిద్య.. దగ్గరగా..!

- ఈ ఏడాది నుంచి వైవీయూలో దూరవిద్య ప్రారంభం
- తొలివిడతలో 15 కోర్సులకు డెబ్ సిఫార్సు

కరువుసీమలో విద్యాసౌరభాలు వెదజల్లుతున్న యోగివేమన విశ్వవిద్యాలయం దూరవిద్య ద్వారా దూరప్రాంతాల వారికి సైతం మరింత దగ్గర కానుంది. వర్సిటీకి న్యాక్ 'ఏ' గ్రేడ్ లభించడంతో దూరవిద్యను ప్రారంభించేందుకు డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో (డెబ్) అనుమతులిచ్చింది.

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం సిగలో మరో కలికితురాయి వచ్చి చేరింది. తాజాగా 'దూర విద్య'ను ప్రారంభించనుండటంతో జిల్లా వాసులతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల విద్యార్థులు, ఉద్యోగులు, గృహిణులు సైతం డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా తాము కోరుకున్న విద్యను పొందే అవకాశం లభించింది. గతేడాది వైవీయూకు న్యాక్ ఏ గ్రేడ్ లభించడంతో డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ప్రారంభించేందుకు అనుమతి లభించినట్లయింది. దీంతో డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేసి పనులను వేగవంతం చేశారు. కాగా వైవీయూ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ తొలి డైరెక్టర్ ఆచార్య ఏజీ దాము, రెండో డైరెక్టర్‌గా ఆచార్య పి.ఎస్. షావల్లీఖాన్, ప్రస్తుత డైరెక్టర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, సహాయ సంచాలకులు డా. ఆర్.శ్రీధర్ బాబు కృషిచేయడం,విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్యలు సంపూర్ణ సహకారం అందించడంతో త్వరితగతిన డెబ్ అనుమతులు లభించాయి. ఈ ఏడాది జూన్ 26, 27 తేదీల్లో వర్చువల్ విధానంలో నిపుణుల కమిటీ పరిశీలించి 15 కోర్సులకు సిఫార్సు చేసింది.2023-24 విద్యాసంవత్సరం నుంచి డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌ను వైవీయూ అధికారులు ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేశారు.దీంతో రెగ్యులర్ విధానంతో పాటు దూరవిద్యను సైతం విశ్వ విద్యాలయం సమాంతరంగా నిర్వహించనుంది.



వైవీయూ పరిపాలన భవనం

తొలివిడతలో 15 కోర్సుల్లో ప్రవేశాలకు సిఫార్సు..

విద్యార్థులు, గృహిణులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు ఉపయుక్తమైన కోర్సులను విశ్వవిద్యాలయం ప్రవేశపెట్టనుంది. మార్కెట్ డిమాండ్‌కు అవసరమైన కోర్సులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు, పదోన్నతులు పొందే అవకాశం ఉన్న కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో అధికారులు 15 కోర్సులకు సిఫార్సు చేయగా, ఈ అకడమిక్ ఇయర్‌కు సంబంధించి తొలి విడతలో 13 రకాల కోర్సులను ప్రారంభించనున్నట్లు సమాచారం.

కోర్సుల వివరాలు..

యూజీ కోర్సులు : బీఏ జనరల్, బీఏ (హిస్టరీ, ఎకనామిక్స్, కంప్యూటర్ అప్లికేషన్స్), బీఏ (ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్), బీకాం, బీఏ (హిస్టరీ, పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్), బీఏ (హిస్టరీ, పొలిటికల్ సైన్స్, స్పెషల్ తెలుగు).

పీజీ కోర్సులు : ఎంఏ (హిస్టరీ), ఎంఏ (తెలుగు), ఎంఏ (ఎకనామిక్స్), ఎంఏ (ఇంగ్లీషు), ఎంఏ (జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్), ఎంకాం, ఎంఏ (సైకాలజీ), ఎంఏ (పొలిటికల్ సైన్స్). ఎంఏ (మ్యాథమ్యాటిక్స్).

చేనేతలను ఆదుకున్నది వైఎస్సార్‌సీపీనే

జమ్మలమడుగు : చేనేత కార్మికుల సమస్యను గుర్తించి వారిని ఆదుకున్న ప్రభుత్వం వైఎస్సార్‌సీపీనేనని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కార్మిక సంఘం నాయకులు బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి బడిగించల చంద్రమౌళి, హస్త కళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బడిగించల విజయలక్ష్మీ ఆధ్వర్యంలో ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. అనంతరం చేనేత నాయకుడు మాజీ ఎమ్మెల్యే కుండా రామయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో అత్యధిక చేనేత కార్మికులు ఉన్నారన్నారు. వారిని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా ఏడాదికి 24 వేల రూపాయలు చేనేత కార్మికుల ఖాతాలలో వేస్తున్నారన్నారు. 50 ఏళ్లు దాటిన కార్మికుల కుటుంబాలకు పెన్షన్ ఇస్తున్నారన్నారు. క్లస్టర్‌ల ద్వారా చేనేత కార్మికులకు మగ్గాలకు సంబంధించిన పనిముట్లను సబ్సిడీ ద్వారా ఇప్పిస్తున్నట్లు చెప్పారు. అనంతరం హస్త కళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బడిగించల విజయలక్ష్మీ మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేతల కోసం మన ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి దాదాపు వేయి కోట్ల రూపాయలు ఖర్చు చేసి పెద్ద మనసు చాటుకున్నారన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం కనీసం వంద కోట్లు కూడా ఖర్చు ఖర్చు చేయలేదన్నారు. అనంతరం చేనేత కార్మికులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చేనేత కార్మికుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఇద్దరు చైన్‌స్నాచర్లు అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరంలో చైన్‌స్నాచింగ్‌లు, దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను కడప డీఎస్పీ ఎం.డి. షరీఫ్ పర్యవేక్షణలో రిమ్స్ పీఎస్ సీఐ కె.రామచంద్ర ఆధ్వర్యంలో సోమవారం స్పోర్ట్స్ స్కూల్ వద్ద వాహనాల తనిఖీల సమయంలో అరెస్ట్ చేశారు. ఈ వివరాలను సోమవారం రిమ్స్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ రామచంద్ర వివరించారు. అరెస్టయిన వారిలో చింతకొమ్మదిన్నె మండలం అంగడివీధి, చిన్నముసల్‌రెడ్డి పల్లెకు చెందిన ఆకుల అహ్మద్, కదిరి వేలు శ్రీకాంత్ వున్నారు. వీరిలో అహ్మద్ డిప్లొమా, శ్రీకాంత్ డిగ్రీ వరకు చదువుకున్నారు. వీరు స్కూల్‌లో చదివే సమయంలో నుంచే స్నేహితులు. చెడు వ్యసనాలకు బానిసలుగా మారి, సరిగా చదువుకోక నేరాలకు పాల్పడుతున్నారు. కడప నగరంలో ఒంటరిగా తిరుగుతున్న మహిళలను టార్గెట్ చేసి వారి మెడల నుంచి బంగారు చైన్‌లను లాక్కెళుతూ చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. ఈనెల 4వ తేదీన ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఓ మహిళ మెడలో నుంచి బంగారు ఆభరణాలను లాక్కెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి మూడు చైన్ స్నాచింగ్ కేసుల్లో మొత్తం 53.6 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.5 లక్షల మేరకు వుంటుంది. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయడంలో కృషి చేసిన సీఐ రామచంద్ర, ఎస్‌ఐలు వి.నారాయణ, ప్రతాప్‌రెడ్డి, కమాండ్ కంట్రోల్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామచంద్ర

సైబర్ నేరం కేసు

కడప అర్బన్ : కడపలోని ఎస్బీఐ కాలనీలో నివసిస్తూ... కలెక్టరేట్‌లోని ఓ విభాగంలో పనిచేస్తున్న రమేష్ నాయక్ అనే వ్యక్తి ఆన్‌లైన్ ట్రేడింగ్ లో దాదాపు రూ.24 లక్షలు పోగొట్టుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కడప తాలూకా సీఐ ఉలసయ్య ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జువారిలో కార్మికుడి మృతి

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని జువారి సిమెంట్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుడు సాంబశివుడు ఛాతి నొప్పి రావడంతో మృతి చెందాడని ఎర్రగుంట్ల పట్టణ సీఐ ఈశ్వరయ్య సోమవారం తెలిపారు. మండలంలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన శివనారాయణ కుమారుడు సాంబశివుడు జువారి సిమెంట్ ఫ్యాక్టరీలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేసుకుంటూ జీవనం సాగించే వాడు. డ్యూటీలో ఉండగా ఛాతిలో నొప్పి రావడంతో మృతి చెందాడని మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఎమ్మెల్యే సాయం

ఈ విషయం తెలుసుకున్న వెంటనే జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టరు ఎం.సుధీర్‌రెడ్డి స్పందించి మృతుడు సాంబశివుడు కుటుంబానికి ఆర్థిక సాయం అందించాడు. అంతేకాకుండా ఆ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చాడు.

పైపుల వాహనం బోల్తా

గోపవరం : మండలంలోని సెంచూరీ ఫ్లైవుడ్ పరిశ్రమ వద్ద ఎస్‌హెచ్–67 జాతీయ రహదారిపై పీవీసీ పైపుల లోడుతో వెళుతున్న మినీ వాహనం బోల్తాపడింది. సోమవారం బద్వేలు వైపు నుంచి నెల్లూరుకు వెళుతుండగా వాహనానికి సంబంధించిన టైరు పగలడంతో రోడ్డుకు అడ్డంగా బోల్తాపడింది. దీంతో పైపులన్నీ రోడ్డు పొడవునా పడ్డాయి. వాహనం బోల్తాపడిన సమయంలో ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ గాయపడ్డాడు. వెంటనే సెంచూరీ పరిశ్రమకు సంబంధించిన అంబులెన్స్‌లో.. గాయపడిన డ్రైవర్‌ను బద్వేలు ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న బద్వేలు రూరల్ ఏఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని రోడ్డుకు అడ్డంగా పడిన వాహనం, పైపులను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు.



బోల్తా పడిన పీవీసీ పైపుల వాహనం

అంగళ్లు ఘటనపై 5 కేసులు నమోదు

మదనపల్లె : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అంగళ్లు పర్యటనలో భాగంగా చోటుచేసుకున్న అల్లర్లు, ఘర్షణలపై 5 కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ కేశప్ప సోమవారం తెలిపారు. ప్రమేయం ఉన్న వారిగా 50 మందిని గుర్తించామన్నారు. వీడియోలు, సీసీ పుటేజీల ఆధారంగా 50 మందిని గుర్తించి, త్వరలోనే అరెస్ట్ చేయనున్నట్లు చెప్పారు. సోమవారం 10 మందిని రిమాండ్‌కు పంపామని, నిందితుల గుర్తింపునకు 8 మంది సీఐలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఘటనలో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరినీ అన్ని కోణాల్లో సమగ్రంగా దర్యాప్తు జరిపి అరెస్ట్ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రాజెక్టుల సందర్శన పేరుతో చంద్రబాబు పగటి వేషాలు

చాపాడు : 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో ఒక్క ప్రాజెక్టు కూడా కట్టలేదని, ఇప్పుడు ప్రాజెక్టుల సందర్శన పేరుతో ఎన్నికల స్టంట్ కోసం పగటి వేషాలు వేస్తున్నారని, రాష్ట్రంలో టీడీపీ చాప్టర్ క్లోజ్ అయిందని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. చాపాడు మండలం వెదురూరు గ్రామంలో రైతు భరోసా కేంద్రం ప్రారంభం సందర్భంగా సోమవారం వ్యవసాయ, ఉద్యాన రాష్ట్ర సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డిలతో కలసి ఎమ్మెల్యే మాట్లాడారు. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఐదేళ్లలో ప్రజలకు చేసేందేమీ లేదని, దీంతో గత ఎన్నికల్లో ఘోరంగా ఓటమి చెందారన్నారు. రాష్ట్రంలో నాడు ఎన్టీఆర్, వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రాజెక్టులను నిర్మించారని, 14 ఏళ్ల పరిపాలనలో చంద్రబాబు ఒక్క ప్రాజెక్టు కూడా నిర్మించలేదన్నారు. గత ఐదేళ్లలో కడప జిల్లాలోని తెలుగుగంగ ప్రాజెక్టును పట్టించుకోలేదని, కేసీ కెనాల్‌కు సాగు నీరు ఇవ్వలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, రైతులకు పంటలు బాగా పండి గిట్టుబాటు ధరలు ఉన్నాయన్నారు. కరోనా సమయంలో కూడా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారన్నారు. నాలుగేళ్లలో అన్ని హామీలు నెరవేర్చారన్నారు. టీడీపీ హయాంలో ఉన్న బడ్జెటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉందని, నాడు ప్రజలకు పథకాలు అందించలేదని, నేడు అన్ని వర్గాల ప్రజలకు పథకాలు అందుతున్నాయన్నారు. రాష్ట్రంలో టీడీపీ నాయకులు కేవలం విమర్శలకే పరిమితమయ్యారని, 2024 ఎన్నికల్లో చంద్రబాబుకు ఘోర ఓటమి తప్పదన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ లక్ష్మయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖరరెడ్డి, స్థానిక ప్రజాప్రనిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాఘురామిరెడ్డి

వ్యక్తి అనుమానాస్పద మృతిపై విచారణ

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 6వ తేదీన ఉదయం కప్పా రాజు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంపై కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. కడప రిమ్స్ మార్చురీలో వున్న కప్పా రాజు మృతదేహాన్ని ఆర్డీఓ పరిశీలించారు. సంఘటన స్థలానికి వచ్చిన రాజు కుమార్తె రాజేశ్వరి, బంధువులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కడపలో తిరుపతి, వాసుదేవరాజు వెల్డింగ్ పనికి పిలిచారని ఆ మేరకు ఈనెల 2వ తేదీన తమ స్వగ్రామం కాకినాడ జిల్లా ఏలేశ్వరం నుంచి కప్పా రాజు వచ్చారని వారు తెలియజేశారు. ఆ తరువాత తాను కడపకు చేరానని తెలియజేశారని, గత రెండు రోజుల నుంచి తన తండ్రి ఫోన్ పని చేయలేదని, ఈనెల 6వ తేదీన చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ వారు ఫోన్ చేసి తన తండ్రి మరణవార్తను తెలియజేశారని వివరించారు. తన తండ్రి అనారోగ్యంతో బాధపడుతున్నాడని, మద్యం మానేందుకు వైద్యం చేయించామని తెలియజేశారు. తన తండ్రిని పనికి పిలిపించిన వారు బాధ్యతగా వ్యవహరించలేదని, వారిపై చర్యలు తీసుకోవాలని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలోనే కడప చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్‌కు కప్పా రాజును తీసుకుని వచ్చినప్పటి నుంచి ఆటోలో రిమ్స్‌కు తరలించేంత వరకు సీసీ కెమెరాలలో నమోదు అయిన సీసీ పుటేజీలను కడప ఆర్డీఓతో పాటు, కడప డీఎస్పీ ఎం.డి. షరీఫ్ సమక్షంలో మృతుని బంధువులు పరిశీలించి తెలుసుకున్నారు. ఈ సంఘటనపై సమగ్రంగా విచారణ చేస్తున్నామని ఆర్డీఓ స్పష్టం చేశారు. పోస్టుమార్టం అనంతరం పోలీసులు కప్పా రాజు మృతదేహాన్ని కుమార్తె, బంధువులకు అప్పగించారు.



మృతుడి కుమార్తె, బంధువులతో వివరాలు సేకరిస్తున్న ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి

భార్య హత్య కేసులో భర్తకు యావజ్జీవం

ప్రొద్దుటూరు క్రైం : అనుమానంతో భార్యను వేధించి కిరాతకంగా హత్య చేసిన కేసులో ప్రొద్దుటూరు కోర్టు పొలుగాండ్ల చంద్రకు యావజ్జీవ కారాగార శిక్షతోపాటు రూ.1.50 లక్షల జరిమానా విధించింది. 2015లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి మైదుకూరు పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మైదుకూరు మండలంలోని మిట్టమానుపల్లె గ్రామానికి చెందిన పొలుగాండ్ల చంద్ర భార్య సావిత్రిపై అనుమానం పెంచుకున్నాడు. దీంతో ఆమెను రోజూ చిత్రహింసలకు గురి చేసేవాడు. ఈ క్రమంలోనే భార్యను విచక్షణా రహితంగా పిడిబాకుతో పొడిచి పారిపోయాడు. కొద్ది సేపటి తర్వాత ఆమె మృతి చెందింది. జొన్నవరం గన్నయ్య ఫిర్యాదు మేరకు మైదుకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రమేయమున్న మృతురాలి భర్త పొలుగాండ్ల చంద్రను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. ప్రొద్దుటూరులోని రెండవ అదనపు జిల్లా కోర్టులో ఈ కేసు విచారణ జరుగుతూ వచ్చింది. ఈ క్రమంలో సోమవారం ఈ కేసు తుది విచారణ జరిగింది. సావిత్రి హత్య కేసులో నేర నిరూపణ కావడంతో పొలుగాండ్ల చంద్రకు రెండవ అదనపు జిల్లా కోర్టు జడ్జి జీఎస్ రమేష్ కుమార్ యావజ్జీవ కారాగార శిక్షతోపాటు రూ.1.50 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. సరైన సమయంలో సాక్షులను కోర్టులో హాజరు పరచడంలో కృషి చేసిన మైదుకూరు అర్బన్ సీఐ బీవీ చలపతి, కోర్టు మానిటరింగ్ సిబ్బంది నాగరాజు, బ్రహ్మయ్య, కోర్టు కానిస్టేబుళ్లు ఎంజీ వల్లి, రాజశేఖర్‌లను, ప్రాసిక్యూషన్‌లో బలమైన వాదనలు వినిపించి ముద్దాయికి శిక్ష పడేలా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాంప్రసాద్‌రెడ్డిని జిల్లా ఎస్పీ అన్బురాజన్ అభినందించారు.



ముద్దాయి చంద్ర

బైక్‌ను ఢీకొన్న కారు

కాశినాయన : మండలంలోని బసనపల్లె నాలుగు రోడ్ల కూడలిలో మోటారు బైక్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నాయునిపల్లె గ్రామానికి చెందిన ఆదిమూలపు రామముని, బూదాల చిన్నరామయ్యలు మోటారు బైక్‌పై పోరుమామిళ్ల నుంచి స్వగ్రామానికి వెళుతుండగా.. బసనపల్లె నాలుగు రోడ్ల కూడలి వద్ద ఆనంవారిపల్లె నుంచి నరసాపురం వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో చిన్నరామయ్య, రామమునిలకు గాయాలయ్యాయి. వారిని వెంటనే స్థానికులు 108 వాహనంలో పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాశినాయన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కారును స్వాధీనం చేసుకున్నారు.



గాయపడిన రామముని

కారు దగ్ధం

వల్లూరు : కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో వల్లూరు మండలంలోని సత్యా గ్రీన్ సిటీ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి కారు దగ్ధమైంది. కడప పట్టణంలోని యర్రముక్కపల్లె నిత్యా కాలనీకి చెందిన రవి కుమార్ అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి అనంతపురం నుంచి కడపకు బయలు దేరాడు. సత్యా గ్రీన్ సిటీ సమీపంలో షార్ట్ సర్క్యూట్‌తో ఇంజిన్ నుంచి మంటలు రావడంతో కారును రోడ్డు పక్కకు దింపి నిలిపారు. వెంటనే అప్రమత్తమై కారు నుంచి దిగారు. ఈ క్రమంలో వారు స్వల్పంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో చికిత్స కోసం కడపకు తరలించారు. ఈ మార్గంలో వెళుతున్న వాహనదారులు అగ్నిమాపక శాఖ వారికి సమాచారం ఇవ్వడంతో.. వారు వెంటనే వచ్చి మంటలను ఆర్పివేశారు. కాగా కారు అప్పటికే దగ్ధమైంది. కారులో వున్న రవి కుమార్ కుటుంబ సభ్యుల సెల్‌ఫోన్‌లు, ఇతర లగేజీ దగ్ధమయ్యాయి.



కాలిపోయిన కారు

ఎర్రచందనం దుంగల స్వాధీనం

రాజంపేట రూరల్ : జెల్లకోనలో 40 ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకోవటంతో పాటు ఇద్దరు కూలీలను అరెస్టు చేసినట్లు జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్ తెలియజేశారు. స్థానిక అటవీ శాఖ కార్యాలయ ఆవరణలో ఆయన సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. శేషాచల అడవులలో కూబింగ్ నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. మండల పరిధి రోళ్లమడుగు బీటులోని ఎస్‌ఆర్ పాళెం సెక్షన్ అటవీ ప్రాంతంలో అక్రమంగా ఎర్రచందనం తరలిస్తున్న తమిళనాడు రాష్ట్రం ధర్మపురి జిల్లాకు చెందిన వెంకట్రామన్, శరవణన్ అనే ఇద్దరు కూలీలను అదుపులోకి తీసుకున్నట్లు తెలియజేశారు. వారి వద్ద నుంచి రూ.3 లక్షల విలువ చేసే 40 ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. సమావేశంలో ఏఫ్‌ఎస్‌ఓ ఎస్ రవిశంకర్, ఎఫ్‌బీఓ జి.కిరణ్‌కుమార్, బేస్ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణానికి చెందిన షేక్ షామీర్ బాషా(12) అనే యువకుడు అదృశ్యమయ్యాడు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి కనిపించడం లేదని అతని తండ్రి సలీంబాషా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు నంబర్లు: 83318 98436/ 9121100559 / 9121100560లకు ఫోన్ చేసి సమాచారం తెలపాలని పోలీసులు తెలిపారు.

తప్పిపోయిన మహిళ ఆచూకీ లభ్యం

పెనగలూరు : మండలంలోని కొండూరు దళితవాడకు చెందిన తప్పిపోయిన చెవిటి, మూగ మహిళ ఆచూకీ లభ్యమైనట్లు ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు. ఈ నెల 5వ తేదీన పూలతోట లక్ష్మీదేవి తప్పిపోవడంతో తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టారు. రాజంపేట రైల్వేస్టేషన్‌లో ఆమె ఆచూకీ లభ్యమైనట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆమెను తల్లిదండ్రులు, భర్త కృష్ణయ్యకు అప్పగించారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి

కమలాపురం : రైతులకు నాణ్యమైన విత్తనాలు, కల్తీ లేని ఎరువులను అందించేందుకు డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ సిబ్బంది కృషి చేయాలని హార్టికల్చర్ స్టేట్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో ఏడీఏ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ల సిబ్బందికి నిర్వహించిన ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జేడీఏ అయితా నాగేశ్వరరావుతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కల్తీ ఎరువులు, విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోయేవారన్నారు. పాదయాత్రలో రైతుల బాధలు తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఒక అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు చేయడం హర్షణీయం అన్నారు. రైతులు సాగుకు కొనుగోలు చేసే ఎరువులు, విత్తనాలు కల్తీ లేకుండా పరీక్షించి నాణ్యమైన ఉత్పత్తులను అందించాలన్నారు. ఇలా చేయడం వల్ల రైతులకు అధిక దిగుబడులు, ఆదాయం వస్తుందన్నారు. జేడీఏ నాగేశ్వరరావు మాట్లాడుతూ ల్యాబ్ సిబ్బంది శిక్షణలో పొందిన అంశాలను విధి నిర్వహణలో పాటించాలన్నారు. ఏడీఏ నరసింహారెడ్డి మాట్లాడుతూ ఆరు రోజుల శిక్షణలో భాగంగా రెండు రోజులు విత్తనాలు, మూడు రోజులు ఎరువులు, ఒక రోజు మట్టి పరీక్షల మీద శిక్షణ ఉంటుందని, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ సరస్వతి, ఏఈఓ దస్తగిరి, జిల్లాలోని అన్ని ల్యాబ్‌లో ఏఓలు, ఏఈఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ఉద్యాన శాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ఆరుగురి అరెస్ట్

సిద్దవటం : సిద్దవటం పోలీసుస్టేషన్‌లో ఈ నెల 3వ తేదీన నమోదైన ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసులో సోమవారం కడపకు చెందిన ఆరు గురిని అరెస్టు చేసినట్లు కడప డీఎస్పీ ఎం.డి. షరీఫ్ తెలిపారు. సిద్దవటం పోలీసుస్టేషన్‌లో సోమ వారం ఆయన విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిద్దవటం మండలంలోని మాధవరం–1 గ్రామానికి చెందిన డ్రైవర్ కత్తి శ్రీనివాసులు ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరానికి చెందిన మహిళ వెంటపడేవాడన్నారు. ఈ విషయాన్ని ఆమె స్నేహితుడు కడపకు చెందిన వంశీకి తెలపడంతో.. వంశీ తన స్నేహితులైన వంశీరాహుల్, ధనుష్, నరసింహారెడ్డి, అజయ్, ముక్తియార్‌లు కలిసి కత్తి శ్రీనివాసులును కులంపేరుతో దూషించి, దాడి చేసి, భయభ్రాంతులకు గురిచేశారన్నారు. దీంతో బాధితుడు ఈనెల 3వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సిద్దవటం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. ఈ మేరకు కడపకు చెందిన వంశీతోపాటు అతని స్నేహితులను సోమవారం సిద్దవటం మండలంలోని భాకరాపేట చెక్‌పోస్టు వద్ద అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్, పోలీసులు పాల్గొన్నారు.

నవోదయను సందర్శించిన శాస్త్రవేత్తలు

రాజంపేట రూరల్ : మండల పరిధిలోని ఆకేపాడు వద్ద గల నారంరాజుపల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయాన్ని సోమవారం ముంబైలోని బార్క్(బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్)కు చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ ఉత్తమజైన్, డాక్టర్ పృధ్వీష్ చౌహాన్‌లు సందర్శించారు. శాస్త్రసాంకేతిక విషయాలపై వారు విద్యార్థులకు వివరించారు. బార్క్‌లో జరుగుతున్న పరమాణు పరిశోధన వంటి వాటిపై అవగాహన కల్పించారు. భారత్ శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎదుగుతున్న తీరును వివరించారు. విద్యార్థులు ఈ రంగాన్ని కెరీర్‌గా ఎంచుకోవడానికి ఉన్న అవకాశాలను వివరిస్తూ మార్గాలను విశదీకరించారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి అవగాహన కల్పించటంతోపాటు వారి సందేహాలను నివృత్తి చేశారు. విద్యాలయ ప్రాచార్యులు పీ గీత మాట్లాడుతూ దేశంలోనే ప్రతిష్టాత్మకమైన బార్క్ సంస్థ నుంచి శాస్త్రవేత్తలు విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించడం ఎంతో సంతోషమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం బార్క్ శాస్త్రవేత్తలు గీతకు సర్టిఫికెట్ అందజేశారు.



నవోదయ ప్రాచార్యులు గీతకు సర్టిఫికెట్ అందజేస్తున్న బార్క్ శాస్త్రవేత్తలు